సాక్షి ఖమ్మం

శనివారం। 17। ఆగస్టు। 2024



వ్యయాన్ని తగ్గిస్తూ లక్ష్యసాధన

వ్యయాన్ని తగ్గిస్తూ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని సింగరేణి సీఎండీ బలరామ్ ఉద్యోగ, కార్మికులకు సూచించారు. 10లో



అర్జంట్ మీకు.. మాకు కాదు!

ఖమ్మం కొత్త బస్టాండ్‌లోని కార్గో సెంటర్ సిబ్బంది నిర్లక్ష్యంతో పార్సిళ్లు సరైన సమయాన గమ్యానికి చేరడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత మాత్రం ఎండ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ముగిసిన పవిత్రోత్సవాలు



శ్రీవారిని చక్రస్నానానికి తోడ్కొని వస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు మూడో రోజైన శుక్రవారం ముగిశాయి. ఈసందర్భంగా శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం నిర్వహించాక, యాగశాలలో మహాపూర్ణాహుతి, స్వామికి చక్రస్నానం చేయించారు. కాగా, పవిత్రోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్ రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాలని వినతి



ఎంపీ రఘురాంరెడ్డితో మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మంరూరల్/ఖమ్మం వన్‌టౌన్: డోర్నకల్ – మిర్యాలగూడ రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్పునకు కృషి చేయాలని వివిధ గ్రామాల రైతులు, నాయకులు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల మీదుగా రైల్వేలైన్ వెళ్లనుండడంతో విలువైన వ్యవసాయ భూములను కోల్పోవాల్సి వస్తోందని తెలిపారు. అలాకాకుండా ప్రత్యామ్నాయ మార్గంలో నిర్మించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరగా ఎంపీ రైల్వే జీఎం, కేంద్రమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, సీపీఐ నాయకులు బెల్లం శ్రీను, కె.చంద్రశేఖర్, పి.యుగంధర్, ఉప్పల్‌రావు, సుధాకర్, రాము పాల్గొన్నారు.

ఈనెల 30లోగా పరీక్ష ఫీజు చెల్లించండి

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన ఈ ఏడాది అక్టోబర్‌లో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు ఈనెల 22 నుంచి 30వ తేదీలోగా చెల్లించాలని డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు సూచించారు. పదో తరగతి అభ్యర్థులు థియరీ సబ్జెక్ట్, ప్రాక్టికల్ సబ్జెక్ట్‌కు రూ.100 చొప్పున, ఇంటర్ అభ్యర్థులు రూ.150 చొప్పున చెల్లించాలని తెలిపారు. సబ్జెక్టుకు రూ.25 చొప్పున అపరాధ రుసుముతో సెప్టెంబర్ 4వరకు, రూ.50 జరిమానాతో 9వ తేదీ వరకు చెల్లించే అవకాశముందని చెప్పారు. www.telanganaopenschool.org వెబ్‌సైట్ ద్వారా లేదా మీసేవ, టీజీ ఆన్‌లైన్ సెంటర్లలో ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

ఖమ్మం మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు శనివారం నుంచి వరుసగా మూడు రోజులు సెలవులు ఉంటాయని ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శని, ఆదివారాలు వారాంతపు సెలవు దినాలు కాగా, సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. తిరిగి మంగళవారం నుంచి కొనుగోళ్లు మొదలవుతాయనే విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు.

ఏఓలు, ఏఈఓల రిలీవ్

ఖమ్మంవ్యవసాయం: ఇటీవల బదిలీ అయిన వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు శుక్రవారం ఎం.విజయనిర్మల ఉత్తర్వులు అందించి విధుల నుంచి రిలీవ్ చేశారు. ఈనెల 3న ఏఓలు, 5న ఏఈఓలకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించినా రుణమాఫీ నేపథ్యాన ఉత్తర్వులు ఇవ్వలేదు. ప్రస్తుతం రుణమాఫీ పూర్తికావడంతో 16 మంది ఏఓలు, 49 మంది ఏఈఓలకు ఉత్తర్వులు ఇవ్వడంతో కొందరు నూతన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు. అయితే, ఏడీఏ, ఆపై స్థాయి అధికారుల బదిలీలపై ఉత్కంఠ కొనసాగుతోంది. రుణమాఫీ పూర్తయిన నేపథ్యాన బదిలీలు ఉటాయని తెలుస్తుండగా శుక్రవారం వరకు స్పష్టత రాలేదు. దీంతో వీరి బదిలీలు ఉంటాయా, మరికొన్నాళ్లు పాత స్థానాల్లోనే కొనసాగిస్తారా అనేది తేలాల్సి ఉంది.

జ్వరం.. జర జాగ్రత్త



ఇంటింటా వివరాలు సేకరిస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు

- సీజనల్ వ్యాధుల వ్యాప్తితో అప్రమత్తమైన వైద్య, ఆరోగ్య శాఖ
- ఇంటింటి సర్వే ద్వారా బాధితుల గుర్తింపు
- క్షేత్రస్థాయిలో చికిత్స ద్వారా వ్యాధుల కట్టడి
- 15 రోజుల్లో 11.96లక్షల మందికి స్క్రీనింగ్

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. గత పదిహేను రోజులుగా ఉధృతి మరింత పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పడకలు సరిపోని పరిస్థితి నెలకొనగా అప్రమత్తమైన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు వ్యాధుల వ్యాప్తిని కట్టడి చేసేందుకు జ్వర సర్వే చేయిస్తున్నారు. పదిహేను రోజులుగా జరుగుతున్న ఈ సర్వే ద్వారా ఇంటింటికీ వెళ్లి జ్వరపీడితులను గుర్తించి చికిత్స అందిస్తున్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధుల వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యంగా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల ద్వారా సర్వే చేయిస్తున్నారు.

4.57లక్షల ఇళ్లలో సర్వే

ఈనెల 1నుంచి 14వ తేదీ వరకు జిల్లాలోని 4,57,232 ఇళ్లలో సిబ్బంది సర్వే చేశారు. జిల్లాలోని 26 పీహెచ్‌సీలు, నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో 11,96,921 మందిని పరీక్షించగా 3,243 మంది జ్వర పీడితులను గుర్తించారు. వీరికి చికిత్స అందించడంతోపాటు మందులు పంపిణీ చేశారు. అయితే, ప్రైవేట్ ఆస్పత్రుల్లో నమోదయ్యే కేసుల వివరాలు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖకు చేరడం లేదు. ఫలితంగా జ్వరాల తీవ్రత మరింత ఎక్కువగానే ఉంటుందని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్నీ జ్వరబాధితులతో కిటకిలాడుతుండగా.. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అదనపు బెడ్లు తెప్పించి చికిత్స అందిస్తున్నారు. ప్రధానంగా డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్, డయేరియాతో ఎక్కువ మంది బాధపడుతున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ ఏడాది మొదటి నుంచి ఈనెల 14వరకు 364 డెంగీ కేసులు నమోదు కాగా.. కేవలం ఈనెలలోనే 79 కేసులు నమోదు కావడం గమనార్హం. అయితే, ప్రైవేట్ ఆస్పత్రుల లెక్కలు కూడా తేలితే ఈ సంఖ్య ఎక్కువగా ఉంటుందని తెలుస్తోంది.

ఇదీ లక్ష్యం

జిల్లాలో సీజనల్ వ్యాధుల ఉధృతిని కట్టడి చేసేలా ఇంటింటి జర సర్వే చేపట్టారు. ఆశ, ఏఎన్ఎల ఆధ్వర్యాన ప్రతీ ఇంటికి వెళ్లి ఎవరెవరికి జ్వరం లక్షణాలు ఉన్నాయో ఆరా తీసి ఇబ్బందేమీ లేకపోతే మందులు ఇస్తున్నారు. ఒక వేళ జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటే ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో ఇప్పటి వరకు 11లక్షల మందికి పైగా సర్వే చేయగా 72మందికి డెంగీ, 34మందికి డయేరియా, 15మందికి టైఫాయిడ్ సోకినట్లు తేలింది. మరికొందరు ఇతర జ్వరాలతో బాధపడుతున్నట్లు తేల్చారు. ఇంటింటి సర్వే ద్వారా బాధితులను గుర్తించి మందులు ఇస్తుండడమే కాక ఇతరులకు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తుండడంతో కట్టడి సాధ్యమవుతోందని అధికారులు చెబుతున్నారు.

జ్వర సర్వే వివరాలు		
ఇళ్లు	పరీక్షించిన వ్యక్తులు	జ్వరబాధితులు
4,57,232	11,96,921	3,243

మూడేళ్లుగా నమోదవుతున్న డెంగీ కేసులు

2022	2023	2024
862	530	364

(ఈనెల 14వ నాటికి)

వాతావరణ మార్పులు.. పారిశుద్ధ్య లోపం

ఇటీవల కురిసిన వర్షాలతో పాటు వాతావరణంలో వచ్చిన మార్పులతో వ్యాధుల వ్యాప్తి పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ముప్పు తప్పదని హెచ్చరిస్తున్నారు. వర్షాలతో నీళ్లు నిలవడంతో దోమల వ్యాప్తి పెరిగింది. పగటి పూట కుట్టే దోమల వల్ల డెంగీ, డ్రెయినేజీల్లో పెరిగే దోమల కారణంగా ఇతర జ్వరాలు వ్యాపిస్తున్నాయి. ఇళ్లలోనే కాక పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చని అవగాహన కల్పిస్తున్నారు.

ఖమ్మం కన్యకాపరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు



వరలక్ష్మీ నమోస్తుతే...

శ్రావణమాసంలో రెండో శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మహిళలు వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. కొందరు ఇళ్లలోనే వ్రతం జరుపుకోగా.. మరికొందరు ఆలయాల్లో జరిగిన సామూహిక వ్రతానికి హాజరయ్యారు. భక్తిశ్రద్ధలతో అమ్మ వారికి పూజలు చేసిన అనంతరం మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మంత్రి.. బైక్ సవారీ !

- కమిషనర్, మేయర్‌తో కలిసి పర్యటన
- పారిశుద్ధ్య నిర్వహణపై అసంతృప్తి



బైక్‌పై వెళ్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: జాతీయ రహదారిపై ఖమ్మంలోని ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్‌కు సంబంధించి భూసేకరణపై స్థానికులతో చర్చించి అంతా ఒప్పుకున్నాకే టెండర్లు నిర్వహించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. మంత్రి శుక్రవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మేయర్ పి.నీరజతో కలిసి బైక్‌లపై పర్యటించారు. ఖమ్మం త్రీటౌన్‌లోని పత్తి మార్కెట్ వెనుక నుండి గోళ్లపాడు ఛానల్–2ను పరిశీలించి ధంసలాపురం ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ వరకు వెళ్లారు. నగరంలో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు త్రీటౌన్ మున్నేటి పక్కగా ధంసలాపురం వరకు రోడ్డు నిర్మించేందుకు ఉన్న అవకాశాలపై ఆరా తీశారు. భూమి ఇస్తారా అని స్థానికులతో మాట్లాడిన మంత్రి.. భూసేకరణపై చర్చించాలని కార్పొరేటర్లకు సూచించారు. కాగా, నగరంలో పారిశుద్ధ్య నిర్వహణపై సక్రమంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి ఇకనైనా తీరు మారకపోతే అధికారులు, సిబ్బందిని బదిలీ చేయిస్తామని హెచ్చరించారు. పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, కార్పొరేటర్ కమర్తపు మురళి, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, తిలక్, ఆళ్ల అంజిరెడ్డి, కొప్పెర ఉపేందర్, గజ్జల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

175 మంది జేఎల్‌ఎంలకు పదోన్నతి

శాఖాపరమైన ఆరోపణలతో 17మందికి బ్రేక్



సత్తుపల్లిలో సంబురాలు చేసుకుంటున్న విద్యుత్ ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ పరిధిలో 175 మంది జూనియర్ లైన్‌మెన్ల(జేఎల్‌ఎం)కు అసిస్టెంట్ లైన్‌మెన్లు(ఏఎల్‌ఎం)గా పదోన్నతి లభించింది. ఈ ప్రక్రియ గురువారం మొదలుకాగా సర్కిల్ పరిధిలో 198 మందిని పదోన్నతికి అర్హులుగా గుర్తించారు. డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ) ఆధ్వర్యాన ఎస్ఈ సురేందర్ పర్యవేక్షణలో ఖమ్మం సర్కిల్ కార్యాలయంలో జాబితాను పరిశీలించి శాఖాపరమైన ఆరోపణలు ఉన్న 17మంది మినహా మిగతా వారికి పదోన్నతులు కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, ఎంఆర్టీ డివిజన్‌లో మరో ఆరుగురికి తాత్కాలికంగా పదోన్నతి నిలిపివేయగా మొత్తంగా 175మందికి అవకాశం దక్కింది. అయితే, ఈ ఆరుగురికి ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు అందే అవకాశముందని తెలుస్తోంది. డివిజన్ల వారీగా ఖమ్మం టౌన్‌లో 51మందికి, సత్తుపల్లి డివిజన్‌లో 41 మందికి, ఖమ్మం రూరల్‌లో 67 మందికి, వైరాలో 16 మందికి పదోన్నతి లభించింది. వైరా డివిజన్ ఎర్రుపాలెం సెక్షన్ పరిధిలో విద్యుత్ మీటర్ల వ్యవహారమై అక్రమాలు జరిగిన నేపథ్యాన పలువురు జేఎల్‌ఎంలకు పదోన్నతి నిలిచిపోయినట్లు సమాచారం.

ఇతర కేటగిరీలపై...

ఎన్పీడీసీఎల్‌లోని పలు కేటగిరీల ఉద్యోగులకు పదోన్నతి విషయమై సీఎండీ కె.వరుణ్‌రెడ్డి శుక్రవారం ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. సర్కిల్, కార్పొరేట్ స్థాయిలో పదోన్నతుల అంశంపై చర్చించగా.. డ్రైవర్లు, టెలిఫోన్ ఆపరేటర్లను ఇతర విధుల్లో వినియోగించుకోవాలనే యోచనలో ఉన్నట్లు సీఎండీ చెప్పారని తెలిసింది. లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఎఫ్ఎల్ఐ, ఫోర్‌మెన్లు, ఏఓలు, ఏఏఓలు, జేఏఓల పదోన్నతులు సర్కిల్ స్థాయిలో, సబ్ ఇంజనీర్లు మొదలు ఏఈలు, ఏడీఈలు, డీఈలు, ఎస్ఈలు, ఆపై కేటగిరీల ఉద్యోగులకు కార్పొరేట్ పరిధిలో నిర్వహిస్తామని వెల్లడించినట్లు సమాచారం.

ఉద్యోగుల సంబురాలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి డివిజన్‌లో 41 మంది జూనియర్ లైన్‌మెన్లకు పదోన్నతి లభించడంతో 1104 యూనియన్ ఆధ్వర్యాన స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొలిసి స్రవంతితో పాటు రమణ, ఎం.రాము, వి.రామారావు, వి.శ్రీరాం, టి.లక్ష్మణ్‌రావు, నాగేశ్వరరావు, రాజేష్, అశోక్‌రెడ్డి, జమీల్, రవి, హరీష్, రమేష్, పవన్, ఖాసీం, హనీఫ్ పాల్గొన్నారు.

రుణమాఫీ లెక్క తేలింది..

- 23,546 మంది రైతులకు రూ.245.85 కోట్లు మాఫీ
- బ్యాంకుల వారీగా వివరాలు వెల్లడి
- ఏపీజీవీబీలో అధికంగా రూ.105 కోట్లు



ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వం రైతులకు సంబంధించి రుణాలను మూడో విడతగా మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. చివరి దశలో రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఉన్న రుణాల మాఫీ నేపథ్యాన బ్యాంకుల వారీగా వివరాలను శుక్రవారం విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 23,546 మంది రైతులకు రూ.245,85,90,089 రుణాలు మాఫీ అయ్యాయి. జిల్లాలోని 14 బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను మాఫీ చేయగా అత్యధికంగా ఏపీజీవీబీ (ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్)లో 7,933 మంది రైతులకు చెందిన రూ.105 కోట్ల రుణాలు ఉన్నాయి. కాగా, జిల్లాలో మొదటి, రెండు విడతల్లో 91,799 మంది రైతులకు రూ.520.76 కోట్లు, మూడు విడతల్లో కలిపి 1,15,345 మంది రైతులకు రూ.766,62,22,434 మాఫీ అయినట్లు ప్రభుత్వ గణాంకాల ద్వారా తెలుస్తోంది.

బ్యాంకుల వారీగా వివరాలు

బ్యాంకు	రైతుల సంఖ్య	రుణమాఫీ (రూ.ల్లో)
ఏపీజీవీబీ	7,933	105,07,21,556
డీసీసీబీ	8,186	49,45,52,334
ఎస్‌బీఐ	3,207	40,68,90,989
యూబీఐ	3,094	37,01,80,391
బ్యాంక్ ఆఫ్ బరోడా	391	5,03,47,612
కెనరా బ్యాంక్	341	4,30,43,118
ఐఓబీ	147	1,24,93,406
సీబీఐ	144	1,76,30,166
పీఎన్‌బీ	42	53,66,572
ఇండియన్ బ్యాంక్	41	50,78,145
బ్యాంక్ ఆఫ్ ఇండియా	07	9,62,195
ఐడీబీఐ	06	5,51,601
హెచ్‌డీఎఫ్‌సీ	05	7,47,368
ఐసీఐసీఐ	02	24,636
మొత్తం	23,546	245,85,90,089

డ్రై డే పకడ్బందీగా చేపట్టాలి..



జనరల్ ఆస్పత్రి ఆవరణలో పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అధికారులు

- కేసులు నమోదయ్యే ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ
- వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్

ఖమ్మంవైద్యవిభాగం: డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడితేనే వ్యాధుల వ్యాప్తి కట్టడి చేయొచ్చని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వీ.కర్ణన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి సీజనల్ వ్యాధులు, డెంగీ నియంత్రణ, వైద్య ఆరోగ్య శాఖ కార్యకలాపాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో డెంగీ కేసులు నమోదవుతున్నందున స్థానిక సంస్థలతో కలిసి వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలిపారు. డ్రై డే కార్యక్రమాలతో దోమల వృద్ధిని అరికట్టవచ్చని చెప్పారు. అలాగే, ఎవరికైనా డెంగీ, మలేరియా సోకగానే చుట్టుపక్కల ఇళ్ల వారినీ పరీక్షిస్తే వ్యాప్తి ఆగిపోతుందని తెలిపారు. వచ్చే 2–3 నెలలు అప్రమత్తంగా ఉంటూ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో డెంగీ బాధితులకు ప్రత్యేక వార్డు ఏర్పాటుచేయాలన్నారు. అంతేకాక ప్లేట్‌లెట్లు పడిపోవడంతో ప్రజల్లో ఉన్న అపోహలు నివృత్తి చేసేలా అవగాహన కార్యక్రమాలు చేపటట్టాలని సూచించారు.



కూసుమంచి పీహెచ్‌సీలో వివరాలు ఆరా తీస్తున్న కమిషనర్

ఆస్పత్రుల్లో పరిశీలన

ఖమ్మంవైద్యవిభాగం/కూసుమంచి: జిల్లా పర్యటనకు వచ్చిన కమిషనర్ కర్ణన్ మార్గమధ్యలో కూసుమంచి పీహెచ్‌సీతో పాటు ఖమ్మంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోజువారీ రక్తపరీక్షలు, డెంగీ కేసులు, చికిత్స, మందుల లభ్యతపై ఆరా తీయడంతో పాటు సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యాన కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమాల్లో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఆర్డీఓ సన్యాసయ్య, డీఎంహెచ్‌ఓ మాలతి, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, డీసీహెచ్ఎస్ రాజశేఖర్, డీటీసీఓ సుబ్బారావు, ఇన్‌చార్జ్ జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, కూసుమంచి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పెదవాగు వద్ద ఊపందుకున్న 'రింగ్‌బండ్' పనులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్ద పెదవాగు ప్రాజెక్టులో రింగ్‌బండ్ నిర్మాణ పనులు ఎట్టకేలకు ఊపందుకున్నాయి. గత నెల 18న భారీ వర్షాలతో వరద పోటెత్తగాప్రాజెక్ట్ ఆనకట్టకు గండ్లు పడిన సంగతి తెలిసిందే. అయితే, ప్రాజెక్టు కింద తెలంగాణ ఆయకట్టుకు ఈ సీజన్‌లో సాగు నీరు ఇచ్చేలా ప్రభుత్వం రూ.3.5 కోట్లు కేటాయించడంతో ఆనకట్ట లోపల భాగంలో తాత్కాలికంగా మట్టితో రింగ్‌బండ్ నిర్మిస్తున్నారు. పనులను గత నెల 27న ప్రారంభించినా వర్షాలతో ముందుకు సాగలేదు. ఇప్పుడు రాత్రి, పగలు యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహిస్తున్నారు.

మళ్లీ తెరపైకి 'రోళ్లపాడు'

- 'సీతారామ' ప్రతిపాదనల్లో తొలుత కీలకంగా ఇదే రిజర్వాయర్
- అభయారణ్యం పేరుతో ఏకపక్షంగా రద్దు చేసిన గత ప్రభుత్వం
- మళ్లీ ప్రతిపాదించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా సీతారామ ప్రాజెక్ట్‌కు భరోసా

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ పంప్‌హౌస్ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ ప్రాజెక్టులో ఎక్కడా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లేకపోవడం లోటనే అంశాన్ని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లేవనెత్తారు. గతంలో రద్దు చేసిన రోళ్లపాడు దగ్గరే రిజర్వాయర్ నిర్మించాలని ఆయన కోరవడంతో ఈ అంశంపై తెరపైకి వచ్చింది.

ఏకపక్షంగా రద్దు

సీతారామ ప్రాజెక్టులో అత్యంత కీలకం రోళ్లపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కావడంతో అశ్వాపురం మండలంలోని గోదావరి తీరంలో డ్యామ్ నిర్మాణ ప్రదేశాన్ని కాదని రోళ్లపాడు వద్దే సీతారామ ప్రాజెక్టుకు 2016 ఫిబ్రవరి 16న శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత రోళ్లపాడు, కిన్నెరసాని రిజర్వాయర్ల దగ్గర చేపట్టే పనులపై టెండర్లు పిలవాలని 2016 మేలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అదే ఏడాది జూలైలో లైడార్ సర్వే చేపట్టగా.. కిన్నెరసాని అభయారణ్యం, కేటీపీఎస్, రైల్వే లైన్లను సాకుగా చూపుతూ ప్రతిపాదనలను రద్దు చేశారు. ఆ తర్వాత ములకలపల్లి మండలంలో రెండు పంప్‌హౌస్‌లతో కొత్త ప్లాన్ తెరపైకి రాగా చకచకా పనులు జరిగాయి.

బ్యాలెన్సింగ్ ఎందుకంటే..

గోదావరికి ఏటా 45 రోజులు వరదలు వస్తాయి. నీటిని ఎత్తి పోసేందుకు అనువైన ప్రవాహం 153 రోజులే ఉంటుంది. దీంతో ముందుజాగ్రత్తగా నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్‌లో నిల్వ చేయడం మంచిదని మంత్రి పొంగులేటి వెల్లడించారు. తద్వారా సీతారామ ప్రాజెక్ట్‌కు భరోసా, ఇల్లెందు నియోజకవర్గంలో లక్ష ఎకరాల కొత్త ఆయకట్టు రావడమేకాక ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్సారెస్పీ చివరి ఆయకట్టును స్థిరీకరించే అవకాశం ఉంది.

జూలురుపాడు–లలితాపురం– రోళ్లపాడు..

మంత్రి సూచనలకు తగ్గట్టుగా రోళ్లపాడులో రిజర్వాయర్ నిర్మించాల్సి వస్తే ఏ ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పాత ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్లడం కష్టమని తెలుస్తుండగా.. ఇంకో వైపు అభయారణ్యం చిక్కులు.. మరోవైపు రాజీవ్‌సాగర్ కెనాల్ కోసం భూమిలో పాతిన పైపులు తొలగించారు. దీంతో మొదటి నుంచి పనులు చేపట్టమటా లేదంటే జూలూరుపాడు కెనాల్ ద్వారా ఇల్లెందు శివారులో సింగరేణి మండలం లలితాపురం చెరువుకు నీళ్లను చేర్చాలి. ఆపై నుంచి ఎత్తిపోతల ద్వారా రోళ్లపాడు రిజర్వాయర్‌కు చేర్చాల్సి ఉంటుంది.

అనుకూలతలు

జిల్లాలో అత్యంత ఎత్తు(216 అడుగులు)లో రోళ్లపాడు ఉంటుంది. ఇక్కడ రిజర్వాయర్‌కు ఆరు కిలోమీటర్ల పొడవు, మూడు కిలోమీటర్ల వెడల్పుతో ఎత్తయిన గుట్టలు రక్షణ వ్యవస్థలుగా ఉన్నాయి. పైగా రిజర్వాయర్‌కు సేకరించే భూమిలో 60 శాతం ప్రభుత్వ స్థలాలే ఉన్నాయి. ఈ విషయాన్ని సాక్షాత్తు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి ప్రకటించడం మరో అనుకూల అంశం. మొత్తం 16 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలని పేర్కొంటుండగా, ఇది అమలైతే కనక ఉమ్మడి జిల్లాలోనే అతిపెద్ద రిజర్వాయర్‌గా నిలవనుంది.

క్లుప్తంగా

ఆళ్లపాడులో విషజ్వరాలు

- పలువురికి చికెన్‌గున్యా, డెంగీ

బోనకల్: బోనకల్ మండలం ఆళ్లపాడులో విషజ్వరాల వ్యాప్తితో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే గ్రామంలో ఒక మహిళ విషజ్వరంతో మృతి చెందింది. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించినా జ్వరాలు అదుపులోకి రావడం లేదు. దీంతో పలువురు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తుండగా పేద, మధ్య తరగతి వారు ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. కాగా, గ్రామానికి చెందిన షేక్ మహ్మద్‌అలీ, ఆయన భార్యకు చికెన్ గున్యా నిర్ధారణ కాగా షేక్ నన్నేసాహెబ్ ఇంట్లో అంతా జ్వరాల బారిన పడ్డారు. ఇక తోటకూర వెంకటేశ్వర్లు సైతం చికెన్‌గున్యాతో చికిత్స పొందుతున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు వైద్య శిబిరాలు కొనసాగించడంతో పాటు పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి

ముదిగొండ: రోడ్డు ప్రమాదంలో ఓ ఇంటర్ విద్యార్థి మృతి చెందగా, మరొకరు గాయపడిన ఘటన ముదిగొండ మండలం గోకినేపల్లి సమీపాన శుక్రవారం చోటుచేసుకుంది. నేలకొండపల్లి మండలం మంగాపురంతండాకు చెందిన గుగులోత్ సంతోష్(19), గుగులోత్ సతీష్ ఖమ్మం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. అయితే, గోకినేపల్లి శివారులో లారీ డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా వస్తూ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న యువకులు బైక్ ఢీకొట్టింది. దీంతో సంతోష్, సతీష్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పకి తరలించేసరికి సంతోష్ మృతి చెందాడు. ఆయన నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి చిన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ముదిగొండ ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

పాముకాటుతో మహిళ..

బోనకల్: మండలంలోని పెద్దబీరవల్లికి చెందిన ఓ మహిళ పాముకాటుతో శుక్రవారం మృతి చెందింది. గ్రామానికి చెందిన గొర్రెముచ్చు ఆరోగ్యం(40) బోనకల్‌లోని పాత ఇనుము దుకాణంలో రోజువారీ కూలీగా పనిచేస్తుంది. ఈక్రమంలో బుధవారం ఆమె కాలిపై రక్తపింజర కాటు వేయడంతో ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగాచికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు భర్త, ముగ్గురు పిల్లలు ఉండగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుబాబు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని వీడీవోస్ కాలనీలో బంధువుల ఇంటికి వచ్చిన ఓ మహిళ మెడలో గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. భద్రాద్రి జిల్లా పాల్వంచకు చెందిన రాజ్యలక్ష్మి ఇటీవల వీడీవోస్ కాలనీలోని తన బంధువుల ఇంటికి వచ్చింది. శుక్రవారం రాత్రి ఆమె పనిపై బయటకు వెళ్లి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై చేరుకుని ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కుని పోయారు. ఇంతలో తేరుకున్న రాజ్యలక్ష్మి కేకలు వేస్తుండగానే వారు పారిపోవడంతో బాధితురాలు ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

మధిర: మధిరలోని విజయవాడ రోడ్డులో ఉన్న ఓ రెస్టారెంట్‌లో పనిచేసే వంట కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. అయితే, మృతుడి వివరాలు, ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై పోలీసులు వివరాలను ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

అర్జంట్ మీకు.. మాకు కాదు!

- ఖమ్మం కొత్త బస్టాండ్ కార్గో సిబ్బంది నిర్లక్ష్యం
- పార్సిళ్లను రెండు రోజులు పట్టించుకోని వైనం
- తిరిగి తీసుకెళ్లిన వినియోగదారుడు



పార్సిళ్లను కారులో తీసుకెళ్తున్న హన్మంతరావు (ఎడమ)

ఖమ్మంమయూరిసెంటర్: నవ్విపోదురు కాక.. మాకేంటి అన్న రీతిలో ఖమ్మం కొత్త బస్టాండ్‌లోని కార్గో పాయింట్ సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలు విమర్శలు ఉన్నా, అధికారులు మందలిస్తున్నా వారి తీరులో మార్పు రావడం లేదు. అత్యవసరమని చెప్పి మరీ బుక్ చేసిన పార్సిల్‌ను రెండు రోజులపాటు పక్కన పడేయడంతో వినియోగదారుడు తిరిగి తీసుకుని అద్దె కారులో పంపించిన ఘటన వెలుగు చూసింది.

ఖమ్మం టు చిలకలూరిపేట

ఖమ్మంకు చెందిన ఎం.హన్మంతరావు కొత్త బస్టాండ్‌లోని కార్గో పాయింట్‌లో ఈనెల 14న రాత్రి చిలకలూరిపేటకు ఓ పార్సిల్ బుక్ చేశారు. అత్యవసరమైనందున అదేరోజు రాత్రే తిరుపతి వెళ్లే బస్సులో పంపించాలని కోరాడు. అయితే మరుసటిరోజైన గురువారం ఆరా తీస్తే పార్సిల్ రాలేదని చెప్పిన చిలకలూరిపేటకు చెందిన వ్యక్తులు శక్రవారం ఉదయం కల్లా పంపించాలని కోరారు. ఎక్కడైనా జాప్యం జరిగిందేమోనని సర్దిచెప్పుకోగా.. శుక్రవారం ఉదయానికి కూడా పార్సిల్ రాలేదని తెలియడంతో అవాక్కడయ్యాడు. ఆపై ఖమ్మం బస్టాండ్‌కు వచ్చి ఆరా తీయగా 14వ తేదీ రాత్రి తాను పార్సిల్ ఎక్కడ పెట్టాడో అక్కడ ఉండడాన్ని చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆపై చేసేదేం లేక తన పార్సిల్ వెనక్కి ఇవ్వాలని కోరగా.. 'టు పే' ఉన్నందున రూ.650 చెల్లించాలని చెప్పడంతో నగదు కట్టి మరో రూ.4వేలతో కారు కిరాయి మాట్లాడి చిలకలూరిపేట బయలుదేరాడు. ఈమేరకు సిబ్బంది నిర్లక్ష్యంపై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు హన్మంతరావు తెలిపాడు.

పర్యవేక్షణ కరువు..

కార్గో సెంటర్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించడం, వారిలో ఎక్కువ మంది అధికారుల బంధువులు, తెలిసిన వారు కావడంతో పర్యవేక్షణ కరువవుతోందని తెలిసింది. పార్సిల్ బుక్ చేయగానే ప్రాంతాల వారీగా ఎప్పటికప్పుడు వేరు చేస్తూ ఆ మార్గంలో వెళ్లే బస్సుల్లో ఎక్కించాలి. కానీ తాము పనిచేసినా, చేయకున్నా పట్టించుకునే వారెవరు లేరనే ధీమాతో సిబ్బంది పార్సిళ్లను వదిలేస్తున్నారనే ఆరోపణలొస్తున్నాయి. ఇక కార్గో పాయింట్ వైపు ఏ అధికారి చూడకపోవడంతో ఆదాయం తగ్గుతుండగా ప్రైవేట్‌పరం చేసేందుకు ఇలా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

వారు చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలే..

- అసలైన రైతుబంధు సీఎం రేవంత్‌రెడ్డి
- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి, పక్కన ఎమ్మెల్యే రాగమయి, తదితరులు

సత్తుపల్లి: సీతారామ ప్రాజెక్టును 90శాతం పూర్తి చేశామని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పడం పచ్చి అబద్ధమని.. రూ.19వేల కోట్ల బడ్జెట్‌లో రూ.7వేల కోట్లు ఖర్చు పెడితే 39శాతం పనులే అవుతాయన్న కనీస జ్ఞానం లేకపోవడం గర్హనీయమని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పేర్కొన్నారు. సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్, ఆర్థిక మంత్రిగా పని చేసిన హరీశ్‌రావుకు లెక్కలు తెలియదేమోనని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే సంక్షేమ, అభివృద్ధి ఫలాలలను ప్రజలకు అందించామన్నారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా అసలైన రైతుబంధు సీఎం రేవంత్‌రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్విభజన ఒప్పందం మేరకు ఇరు రాష్ట్రాలకు నిధులు ఇవ్వాల్సి ఉన్నా కేంద్రం తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఎంపీ ఆరోపించారు.

మీ నాన్న నేర్పిన సంస్కారం ఇదేనా?

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని.. ఆయనకు తండ్రి కేసీఆర్ నేర్పిన సంస్కారం ఇదేనా అని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రశ్నించారు. గతంలోనూ మంత్రి సీతక్క విషయంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు చేస్తే కేటీఆర్ చప్పట్లు కొట్టారని విమర్శించారు. మహిళలను కించపర్చితే ఊరుకోమని తెలిపారు. కాగా, చిన్నాభిన్నమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సీఎం గాడిలో పెట్టేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కాగా, తొలిసారి సత్తుపల్లికి వచ్చిన ఎంపీ రఘురాంరెడ్డిని సన్మానించారు. ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల నర్సింహారావు, గాదె చెన్నారావు, ఉడతనేని అప్పారావు, వినుకొండ కృష్ణ పాల్గొన్నారు.

ట్రైబల్ టూరిజం పెరిగేలా చర్యలు

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మ్యూజియంలో విల్లు ఎక్కి పెట్టిన కలెక్టర్ జితేష్

భద్రాచలం: భద్రాచలంలో ట్రైబల్ టూరిజానికి ఆదరణ పెరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన కళాకృతులు, వస్తువులను ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సీతారామ చంద్రస్వామి కొలువై ఉన్న భద్రాచలానికి పలు రాష్ట్రాల నుంచి భక్తులు, పాపికొండలను తిలకించడానికి పర్యాటకులు వస్తారని, వారంతా ట్రైబల్ మ్యూజియంను సందర్శించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. భద్రాచలం వచ్చే టూరిస్టులకు ఆదివాసీ సంప్రదాయ కళాకృతులు, చరిత్ర, జీవన విధానాలు తెలిసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ నరసింహారావు, ట్రైబల్ మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకోట వద్ద వేడుకల్లో జిల్లా విద్యార్థి



ఎర్ర కోట వద్ద అజయ్‌కుమార్

తల్లాడ: తల్లాడ మండలం అన్నారుగూడెంకు చెందిన విద్యార్థి తోట అజయ్‌కుమార్ ఢిల్లీలో ఎర్రకోట వద్ద గురువారం జరిగిన స్వాతంత్య్ర దినోత్సవంలో పాల్గొన్నారు. ప్రస్తుతం ఖమ్మంలో ఇంటర్ చదువుతున్న ఆయన గత ఏడాది తల్లాడలోని బాలభారతి విద్యాలయంలో ఎస్సెస్సీ చదివిన సమయాన ప్రేరణ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఆతర్వాత పలువురితో కలిసి ప్రధాని మోదీ జరిగిన సంభాషణలో పాల్గొనగా.. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా అజయ్‌ను తల్లాడ ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, కేఎస్‌ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

కాగిత రహితంగా కార్యకలాపాలు

సింగరేణి సీఎండీ బలరామ్



సింథటిక్ లాన్ టెన్నిస్ కోర్టును ప్రారంభిస్తున్న సింగరేణి సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థను కాగిత రహిత కంపెనీగా మార్చాలని సీఎండీ బలరామ్ సూచించారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో నూతనంగా నిర్మించిన భవనంలో ఐటీ, ఈఆర్‌ఏ శాఖల కార్యాలయాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎంప్లాయ్ పర్సనల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వెబ్‌సైట్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వెబ్‌సైట్‌లో ఉద్యోగుల సీఎంపీఎఫ్ గ్రాట్యూటీ, ఇంక్రిమెంట్స్, ట్రాన్స్‌ఫర్, సెలవుల తదితర వివరాలు పొందుపరచాలని చెప్పారు. ఉద్యోగి ఫోన్ నంబర్‌కు ప్రతినెలా జీతం స్లిప్‌లను పంపించాలన్నారు. సంస్థలో పేపర్ వర్క్ లేకుండా చూడాలన్నారు.

ఆరోగ్య రక్షణకు క్రీడలు..

ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు దోహదపడతాయని సీఎండీ పేర్కొన్నారు. కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని గెస్ట్‌హౌస్‌లో రూ. 38 లక్షలతో నిర్మించిన సింథటిక్ లాన్ టెన్నిస్ కోర్టును ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించడంలో సింగరేణి సంస్థ ముందు వరుసలో ఉంటుందన్నారు.

ఆంగ్లభాషపై పట్టుసాధించాలి

ఆంగ్లభాషపై పట్టు సాధించాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ సూచించారు. శుక్రవారం బెంగళూరుకు చెందిన తలియోలా ఇన్ఫోటెక్ సంస్థ డిజిటల్ లింగ్విస్టిక్ మెంటల్ (డీఎల్‌ఎం) ద్వారా రూపొందించిన సాఫ్ట్‌వేర్ కలిగిన బీసీఏ డేటా సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినులు ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో రాణించాలని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో డైరెక్టర్లు ఎస్వీకే శ్రీనివాస్, నారాయణరావు, పి.వెంకటేశ్వరరెడ్డి, అధికారులు సుభాని, బీఆర్ దీక్షితులు, దామోదర్‌రావు, సూర్యనారాయణ, రవికుమార్, మనోహర్, వెంకటరమణ, సుబ్బారావు, నికోలస్, రాజశేఖర్, రాజీవ్ కుమార్, కోడురు శ్రీనివాస్‌రావు, జాకీర్ హుస్సేన్, మహిళా కళాశాల ప్రిన్సిపల్ శారద తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షల్లో పొదుపు నగదు స్వాహా

- పోస్టాఫీస్‌లో ప్రైవేట్ వ్యక్తి ప్రమేయంపై విచారణ

వైరారూరల్: పోస్టాఫీస్‌లో ఖాతాదారులు డిపాజిట్ చేసిన పొదుపు నగదు(ఆర్డీ)ను ప్రైవేట్ వ్యక్తి రూ.లక్షల మేర స్వాహా చేశాడు. పోస్ట్‌మెన్ తనకు బదులు సదరు వ్యక్తిని నియమించడంతో ఇదే అదనుగా కుంభకోణానికి పాల్పడ్డాడు. వైరా మండలం గొల్లపూడి బ్రాంచ్ పోస్టాఫీస్‌ను పోస్ట్‌మెన్ మేడూరి శ్రీనివాసరావు గ్రామంలో తన ఎరువుల దుకాణం పక్కనే ఒక షటర్‌లో ఏర్పాటు చేశారు. ఆ కార్యాలయంలో వరికూటి ప్రవీణ్‌కుమార్‌ను నియమించగా ఆయన ఖాతాదారులు రోజువారీ, నెలవారీ చెల్లించే నగదును మెయిన్ బ్రాంచ్‌లో జమ చేయకుండా స్వాహా చేశాడు. ఇందులో పలువురికి పాస్‌బుక్కులో స్టాంపులు వేయగా.. ఇంకొందరికి పాస్‌బుక్కులే ఇవ్వలేదు. ఇలా 50 మంది ఖాతాల్లో నుంచి రూ.లక్షల మేర నగదు జమ కాలేదని తెలియడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మధిర పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, కలకోట బ్రాంచ్ పోస్టుమెన్ మూడు రోజులుగా గొల్లపూడిలో విచారిస్తున్నారు. పోస్ట్‌మెన్ తనకు బదులు ప్రైవేట్ వ్యక్తిని నియమించడంతో ఇలా జరిగినట్లు తెలుస్తుండగా.. పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాంగ్రెస్ శ్రేణులతో డిప్యూటీ సీఎం భేటీ



డిప్యూటీ సీఎం భట్టికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చింతకాని/ముదిగొండ: చింతకాని మండలం జగన్నాధపురంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చింతకాని, ముదిగొండ మండలాల నాయకులతో పలు అంశాలపై చర్చించిన ఆయన పలు సూచనలు చేసినట్లు తెలిసింది. ఆతర్వాత గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని, బస్వాపురంలో ప్రభుత్వ భూమిని ఇళ్లు లేని నిరుపేదలకు కేటాయించాలని నాయకులు ఆయనకు విన్నవించారు. అనంతరం భట్టి హైదరాబాద్ వెళ్లే క్రమాన ముదిగొండ మండలం నామవరంలో కూలీలతో ఆయన మాట్లాడారు. తమకురేషన్ కార్డులు లేవని, రుణమాఫీ కాలేదని చెప్పిన పలువురు.. మహిళలకు రూ.2,500 ఎప్పుడు ఇస్తారని ఆరా తీశారు. అలాగే, వల్లాపురం – మత్కేపల్లి వద్ద నామవరం మున్నేరు బ్రిడ్జి కిందకు వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు నిర్మించాలని నాయకులు కోరారు. ఈకార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కన్నెబోయిన గోపి, అంబటి వెంకటేశ్వర్లు, బందెల నాగార్జున్, మడుపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, కొప్పుల గోవిందరావు, సట్టు వెంకటేశ్వర్లు, మందరపు నాగేశ్వరరావు, కొమ్మినేని రమేష్‌బాబు, తాటికొండ రమేష్, కందిమళ్ల వీరబాబు, మట్టా బాబురాంరెడ్డి, పందిరి అంజయ్య, రాఘవ, మల్లెల అజయ్, ధర్మనాయక్, వడ్డెల్లి వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

మా వాటా తేల్చకుండా కౌలుకు ఇస్తే అడ్డుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న ఊకే రమేష్

సత్తుపల్లి: మండలంలోని గంగారం గట్టుబజార్, ఎస్టీ కాలనీ గిరిజనుల నడుమ భూవివాదం మళ్లీ రగులుకుంటోంది. రెండు గ్రామాల్లో 25మంది 50 మందికి ఉమ్మడి వ్యవసాయం కోసం 1972లో అప్పటి సీఎం జలగం వెంగళరావు 125 ఎకరాలు అప్పగించారు. ఈమేరకు ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ కోఆపరేటివ్ సొసైటీ, బేతుపల్లి గంగారం పేరిట రిజిస్ట్రేషన్ చేసి సాగు చేసుకుంటున్నారు. అయితే, కొందరు గట్టుబజార్ గిరిజనులను బయటకు పంపించి ఇతరులకు కౌలుకు ఇస్తుండడం సరికాదని గట్టుబజార్‌కు చెందిన గిరిజనులు ఊకే రమేష్, సోయం వెంకటేశ్వర్లు ఆరోపించారు. గంగారంలో శుక్రవారం జరిగిన వారు మాట్లాడుతూ గట్టుబజార్, ఎస్టీ కాలనీకి చెందిన గిరిజన కుటుంబాలకు ఉమ్మడి సాగు కోసం భూమి ఇస్తే ఎస్టీ కాలనీ గిరిజనులు తమను వెళ్లగొట్టి బినామీలకు కౌలు కట్టబెడుతున్నారని తెలిపారు. భూమిలో తమ వాటా తేల్చేవరకు కౌలుకు ఇస్తే అడ్డుకుంటామని పేర్కొన్నారు. తమ గ్రామానికి చెందిన 25 మందిలో 16 మందినే కొనసాగిస్తూ సంబంధం లేని స్థానికేతరులకు సభ్యత్వం ఇచ్చారని, ఆర్డీఓ సర్వే చేసి అందరికీ సమాన హక్కులు ఉన్నాయని చెప్పినా పట్టించుకోవడం లేదని, ఇకనైనా అధికారులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సోయం గోవిందరావు, ఊకే వెంకప్ప, కోటేశ్వరరావు, వాడే మల్లేశ్వరరావు, సలవలం ప్రసాద్, ఊకే పొట్టి పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం



అమ్మవారికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతం అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి భక్తులు పాల్గొన్నారు.

అపరాల సాగులో జాగ్రత్తలు

- సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి
- మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తల సూచనలు



వైరస్ ఆశించిన మినుము పైరు (ఇన్‌సెట్) ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణి



ఎండిపోయిన కంది మొక్క

మధిర: అపరాలు పంటలైన కంది, పెసర, మినుము పంటలు సాగు చేస్తున్న రైతులు తగిన యజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. తద్వారా అధిక దిగుబడి సాధించొచ్చని చెబుతున్నారు. ఈమేరకు రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ కె.రుక్మిణీదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ టి.భరత్, కె.నాగస్వాతి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

- **ఇనుప ధాతులోపం :** తొలకరిలో వేసిన కంది, మినుము, పెసర పైర్లలో అధిక వర్షాల కారణంగా ఇనుప ధాతులోపం కనిపిస్తోంది. ఆకులు పసుపు రంగులోకి మారి ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉంటాయి. కొన్నిసార్లు ఆకులు మొత్తం తెల్లగా మారి ఎండిపోతాయి. దీని నివారణకు ఫెర్రస్ సల్ఫేట్ 2 గ్రాములను లీటర్ నీటికి కలిపి పైరుపై వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- **ఫైటోఫ్తైరా ఎండు తెగులు :** అధిక వర్షాల కారణంగా ఫైటోఫైరా ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంది. ఈ తెగులు సోకితే మొక్కలు పూర్తిగా కానీ కొంతభాగం కానీ ఎండిపోతాయి. ఎండిసపోయిన మొక్కలను తొలగించిన కాండం మొదలు భాగం పరిశీలిస్తే గోధుమ వర్ణపు నిలువు చారలు కనిపిస్తాయి. ఈ తెగులు నివారణకు ఎలాంటి మందులు లేవు. కానీ తెగులు వ్యాప్తి చెందకుండా మెటాలాక్సిల్ రెండు గ్రాములను లీటర్ నీటికి లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములను లీటర్‌ల నీటిలో కలిపి తెగులు సోకిన మొక్కలు, వాటి చుట్టూ మొక్కలు తడిచేలా పోయాలి.
- **లద్దెపురుగు :** అధిక వర్షాలు ఉన్నచోట సాధారణంగా శాఖీయ పెరుగుదల అధికంగా ఉండి పొగాకు లద్దె పురుగు ఆశించి నష్టపరుస్తుంది. తొలి దశలో లార్వాల నివారణ కోసం థయోడికార్బ్ ఒక గ్రామును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పెసర, మినుము, కంది పంటలో హెక్టారుకు నత్రజని 20 కిలోలు, భాస్వరం 50 కిలోలు దుక్కిలో వేయాలి. సూటి ఎరువులు అయిన యూరియా, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వాడాలి
- పెసర, మినుము పంటలు వేసి 15–20 రోజులు అయితే వర్షాలు ఆగగానే ఇమజితాఫిర్ 250 మి.లీ.ను ఎకరానికి పిచికారీ చేస్తే గరిక, వెడల్పాకు కలుపును సమర్థవంతంగా అరికట్టవచ్చు. కలుపు ముదిరితే మందులు పనిచేయవని గుర్తించి 2–3 ఆకుల దశలోనే పిచికారీ చేయాలి.
- వర్షాలు కురిసిన తర్వాత బెట్ట పరిస్థితులు ఏర్పడితే పెసర, మినుమును రసం పీల్చే పురుగులు ఆశిస్తాయి. అలాగే, తామర పురుగు పైరు లేత దశలో ఆశించి ఆకుల్లో రసాన్ని పీల్చి నష్టాన్ని కలగజేయడమే కాక ఆకుముడుత వైరస్‌ను వ్యాపింపజేస్తాయి. దీని నివారణకు ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎకరానికి 10–15 నీలిరంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలి.
- మినుము, పెసర పూతదశలో మారుకా అనే గూడు పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు లీటర్ నీటికి నొవాల్యూరాన్ ఒక మి.లీ. లీటర్ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. కలిపి పిచికారీ చేస్తే పురుగును నివారించవచ్చు.
- పెసర, మినుము మొగ్గ, పూతదశలో ఉంటే భూమిలో ఎక్కువ తేమ ఉండడం వల్ల పూతరాలిపోయే అవకాశముంది. దీన్ని అరికట్టేందుకు నీటిలో కరిగే పోషక పదార్థాలైన 19:19:19 లేదా మల్టీకే 13:0:45 ను 10 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. అలాగే, ప్లానోఫిక్స్ ఒక మి.లీ.ను 4.5 లీటర్ల నీటికి కలిపి ఒక ఎకరంలో పిచికారీ చేసినా పూత రాలడాన్ని అరికట్టవచ్చు.
- కంది పంటను ఆగస్టు ఆఖరి వరకు విత్తుకోవచ్చు. విత్తడం ఆలస్యమైతే నేలతీరును బట్టి సాళ్ల మధ్య దూరం తగ్గించి మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. సాళ్ల మధ్య 75–90 సెం.మీ., మొక్కల మధ్య 15 సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి.

కందిలో చిగుర్లు తుంచడానికి ఇదే అదును



కందిలో చిగురు తుంచుతున్న దృశ్యం

మధిర: వానాకాలంలో సాగు చేసే ముఖ్యమైన అవరాల పంటల్లో కంది ఒకటి. ఇందులో యాజమాన్య పద్ధతులతో పాటు తలకొనలు తుంచడం, చిగుర్లు తుంచడం లేదా నిప్పింగ్ చేయడం ద్వారా మంచి దిగుబడి నమోదవుతుందని మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ కె.రుక్మిణీదేవి తెలిపారు. కంది పంట విత్తాక 45వ రోజు నుంచి 60 రోజుల్లోపు అంటే మొక్క ఎత్తు మూడు అడుగుల నుంచి నాలుగు అడుగుల ఎత్తు ఉన్నప్పుడు తల కొనలు మూడు అంగుళాల మేర తుంచేయాలి. ఇలా చేయడం వల్ల మొక్కల పక్క కొమ్మలు బలంగా వచ్చి పూత, కాత ఎక్కువ ఏర్పడి దిగుబడి పెరుగుతుంది. అంతేకాక గాలి, వెలుతురు బాగా నమోదై పురుగుల, తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది. పూత సమయాన పురుగుమందుల పిచికారీ కూడా సులభమవుతుంది. కొనలు తుంచని పంటతో పోలిస్తే తుంచిన పంటలో దాదాపు 15శాతం అధిక దిగుబడి వస్తుంది. ఇక అధిక వర్షాలు కురిస్తే ఇనుము పోషక లోపం(లేత ఆకుల ఈనెల మధ్య హరిత వర్ణం కోల్పోయి పసుపు రంగులో మారి ఎండి రాలిపోతాయి) కనిపించినట్లయితే లీటర్ నీటికి 5 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్(అన్నభేది)ను ఒక గ్రాము నిమ్మ ఉప్పుతో కలిపి పైరుపై వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

క్లుప్తంగా...



తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూ ర్తి జస్టిస్ పంకజ్ మిట్టల్, ఏపీ హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ పి.రాజశేఖర్ శుక్రవారం దర్శించుకున్నారు.

ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవ ఎన్నిక



మహారాణిపేట (విశాఖ): స్థానిక సంస్థల కోటాలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బొత్సకు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ధ్రువీకరణ పత్రం అందజేశారు. అనంతరం బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు

వైద్యవిద్య ప్రవేశాలు, ఆసుపత్రుల పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్యవిద్య ప్రవేశాలు, దవాఖానాల్లో వసతుల కల్పనను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లో డీఎంఈ సభ్య కార్యదర్శిగా వ్యవహరించనుండగా, డీఎంఈ (అకడమిక్), హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, పీజీ సీట్ల ప్రవేశాల ప్రక్రియను టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షించనుంది. దీంతోపాటు బయోమెట్రిక్ అటెండెన్స్, ఓపీ, ఐపీ, మాతాశిశు సంరక్షణ సేవలు, పోస్టుమార్టం వంటి అన్ని విభాగాల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టనుంది. నిశితంగా పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక అందజేయనుంది.

ఇస్రో అమ్ముల పొదిలోకి మరో రాకెట్

ఎస్ఎస్ఎల్‌వీ డి-3 ప్రయోగం సక్సెస్

కక్ష్యలోకి సురక్షితంగా చేరిన ఈవోఎస్-08, డెమోశాట్ ఉపగ్రహాలు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అమ్ముల పొదిలోకి మరో రాకెట్ చేరింది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సమీపంలో ఉన్న సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ) డి-3 ప్రయోగాన్ని శుక్రవారం ఉదయం విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయోగం ద్వారా 175.5 కేజీల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈవోఎస్-08), ఎస్ఆర్-0 డెమోశాట్ అనే రెండు ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగానికి శుక్రవారం తెల్లవారుజామున 2.47 గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభించారు. అరున్నర గంటలపాటు కౌంట్‌డౌన్ అనంతరం ఉదయం 9.17 గంటలకు ఎస్ఎస్ఎల్‌వీ డి-3 రాకెట్ నింగివైపునకు దూసుకెళ్లింది. రాకెట్‌లోని మొత్తం నాలుగు దశలు సక్రమంగా పనిచేయడంతో 16.56 నిమిషాల్లోనే ప్రయోగం విజయవంతంగా ముగిసింది. భూమికి 475 కిలోమీటర్ల ఎత్తులోని లియో ఆర్బిట్ (సూర్య సమకాలిక కక్ష్య)లో 37.2 డిగ్రీల వృత్తాకారపు కక్ష్యలోకి విజయవంతంగా ఉప గ్రహాలను ప్రవేశపెట్టారు. మొదట ఈవోఎస్-08ను కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ఎస్ఆర్-0 డెమోశాట్ అనే చిన్న ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. కక్ష్యలోకి చేరిన ఉపగ్రహాల నుంచి సిగ్నల్స్ అందడంతో శాస్త్రవేత్తలు సంతోషం వ్యక్తంచేశారు. ఇప్పటివరకు ఇస్రో చిన్న తరహా ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ రాకెట్ల ద్వారా ప్రయోగించి వాణిజ్యపరంగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఇప్పుడు ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్ అందుబాటులోకి రావడంతో వాణిజ్య పరమైన ప్రయోగాల్లో తిరుగులేని శక్తిగా ఇస్రో ఎదుగుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.



ఇవీ ఉపయోగాలు...

ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్-08లో ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం-రిఫ్లెక్టోమెట్రీ, ఎస్ఐసీయూవీ డొసిమీటర్ అనే మూడు రకాల పేలోడ్స్‌ను అమర్చారు. వీటి ద్వా రా ఈ ఉపగ్రహం భూమి మీద వాతావరణ పరిస్థితులు(భౌగోళిక-పర్యావరణం)పై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ సమాచారాన్ని చేరవేస్తుంది. ముఖ్యంగా అటవీ, వ్యవసాయం, భూమి స్వభావం, నీరు, నేల తీరు అధ్యయనాలకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తుంది. ఇది భవిష్యత్తులో ప్రయోగించనున్న గగన్‌యాన్ మాడ్యూల్‌కు అవసరమైన వాతావరణ పరిస్థితులను కూడా అధ్యయనం చేస్తుంది. మైక్రోశాట్ ఉపగ్రహాల్లో అత్యంత అధునాతన టెక్నాలజీ కలిగిన ఈ ఉప గ్రహం ఒక్క సంవత్సరం మాత్రమే సేవలు అందిస్తుంది.

ఇస్రోకు సరికొత్త రాకెట్ అందుబాటులోకి వచ్చింది

ఇస్రో చైర్మన్ సోమనాథ్



ఎస్ఎస్ఎల్‌వీ డి-3 ప్రయోగం అనంతరం ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడుతూ ఇస్రోలో సరికొత్తగా ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్ చేరిందని చెప్పారు. ఇప్పటిదాకా ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ మార్క్-3 వంటి ఐదు రకాల రాకెట్లు మాత్రమే ఉండేవని తెలిపారు. 2022 ఆగస్టు 7న ప్రయోగించిన ఎస్ఎస్ఎల్‌వీ డి-1 రాకెట్ విఫలం కావడంతో అందులో ఏర్పడిన లోపాలను సరిచేసుకుని పలు ముందస్తు పరీక్షలు నిర్వహించి ఎస్ఎస్ఎల్‌వీ డి-3 ప్రయోగానికి సిద్ధమయ్యామని పేర్కొన్నారు. దీనికోసం అహర్నిశలు పనిచేసిన ఇస్రోలోని అన్ని విభాగాల టీమ్‌లకు అభినందనలు తెలిపారు వాణిజ్యపరంగా కూడా ఈ రాకెట్‌ను వినియోగిస్తామని చెప్పారు. వెహికల్ డైరెక్టర్ ఎస్ఎస్ వినోద్, శాటిలైట్ డైరెక్టర్ ఎ.అవినాశ్ మాట్లాడుతూ ఉపగ్రహం నుంచి నిర్దేశించిన విధంగా సిగ్నల్స్ అందాయని తెలిపారు. కాగా, ఇస్రో శాస్త్రవేత్తలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు.

భర్తకు జీవిత ఖైదు సరైందే

భార్య హత్య కేసులో ట్రయల్ కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: భార్య హత్య కేసులో భర్తకు ట్రయల్ కోర్టు జీవిత ఖైదు విధించడం సరైందేనని హైకోర్టు స్పష్టం చేసింది. 'మృతిరాలితో అప్పిలెంట్ (భాస్కర్)కు వివాహం జరిగి నాలుగు నెలలే అయ్యింది. ఆమె మంటల్లో కాలిపోతున్నప్పుడు గదిలో నిందితుడు ఉన్నాడని సాక్ష్యులు చెబుతున్నారు. ఆ మంటలను ఆర్పేందుకు అతను ఎలాంటి చర్యలు చేపట్టలేదు. భర్తకు వ్యతిరేకంగా మృతురాలు తప్పుడు వాంగ్మూలం ఇచ్చిందనడానికి ఎలాంటి కారణాలు లేవు. ట్రయల్ కోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం కనిపించడం లేదు' అని హైకోర్టు తీర్పునిచ్చింది. 2012లో జరిగిన హత్య కేసులో అప్పీలెంట్‌కు జీవిత ఖైదు సరైందేనని 2015లో తేల్చిచెప్పింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన పెద్దింటి భాస్కర్‌కు మృతురాలితో 2012, ఏప్రిల్ 25న వివాహం జరిగింది. వివాహం తర్వాత నెల పాటు దంపతులు భార్య తల్లిగారింట్లోనే ఉన్నారు. 2012, జూలై 15న రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రించారు. అయితే తనకు పీడకలలు వస్తున్నాయని, తల్లి వద్ద నిద్రిస్తానని భాస్కర్‌ను కోరింది. అందుకు నిరాకరించి దుర్భాషలాడుతూ ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. కాలిన గాయాలతో ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆసుపత్రిలో మృతురాలు మేజిస్ట్రేట్‌కు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా భాస్కర్‌ను ట్రయల్ కోర్టు దోషిగా నిర్ధారించింది.

బాధితురాలి మానసిక స్థితి బాగానే ఉంది...

2015, ఏప్రిల్ 17న రంగారెడ్డి జిల్లా కోర్టు తనకు యావజ్జీవ శిక్ష విధించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పెద్దింటి భాస్కర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ జితేందర్‌రావు వీరమల్ల వాదనలు వినిపించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మృతురాలి తల్లి కూడా నిందితుడికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వలేదని, పథకం ప్రకారం హత్య చేశాడని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం... బాధితురాలి నుంచి మేజిస్ట్రేట్ వాంగ్మూలం తీసుకునేముందు ఆమె మానసిక పరిస్థితి బాగానే ఉందని డాక్టరు ధ్రువీకరించారని పేర్కొంది. మరణ వాంగ్మూలం ఆధారంగా శిక్ష విధించవచ్చని సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను ప్రస్తావిస్తూ అప్పీలును కొట్టివేసింది.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫీజు గడువు ఈనెల 30

సాక్షి, హైదరాబాద్: ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు రాయాలనుకునే వారు ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ పీజీ శ్రీహరి తెలిపారు. ప్రతీ పేపర్‌కు రూ.25 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 4 వరకు, రూ.50 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 9 వరకు ఫీజు చెల్లించాలని వెల్లడించారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈ ఏడాది అక్టోబర్‌లో జరుగుతాయన్నారు. వివరాలకు http://www.telanganaopenschool.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

కృషి ఫలించింది.. గేటు పడింది

తుంగభద్ర డ్యాం స్టాప్‌లాగ్ గేటు తొలి భాగం అమరిక

- నేడు మరో రెండు భాగాలు ఏర్పాటు

సాక్షి, బళ్లారి/ హొసపేటే/అనంతపురం సెంట్రల్: వారం రోజులుగా ఇంజినీర్లు చేస్తున్న కృషి ఫలించింది. తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ గేట్ ఏర్పాటు విజయవంతంగా మొదలైంది. స్టాప్‌లాగ్ గేట్‌లో మొదటి భాగాన్ని శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ప్రత్యేక నిపుణుడు కన్నయ్యనాయుడు పర్యవేక్షణలో ఇంజినీర్లు, కార్మికులు విజయవంతంగా అమర్చారు. 15 టన్నులు బరువుతో 4 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పు ఉన్న ఈ భాగాన్ని భారీ క్రేన్ల సాయంతో అమర్చారు. ఇక్కడ మరో నాలుగు భాగాలు అమర్చాల్సి ఉంది. శనివారం రెండు, మూడు భాగాలు అమర్చడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. తొలుత డ్యాం నుంచి 60 టీఎంసీల నీటిని వదిలేసి, 40 టీఎంసీలకు చేరుకున్నాక గేటు అమర్చాల్సి ఉంటుందని నిపుణులు చెప్పారు. అయితే నీటి వృథాను అడ్డుకొని రైతులకు అందించే లక్ష్యంతో స్టాప్‌లాగ్ గేటును అమర్చుతున్నారు.



గేటును విజయవంతంగా అమర్చుతున్న దృశ్యం

ప్రస్తుతం జలాశయంలో 72 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ, మొదటి భాగాన్ని విజయవంతంగా అమర్చారు. మిగిలిన భాగాల ఏర్పాటులో పెద్ద అవరోధాలు ఉండవని డ్యాం అధికారులు తెలిపారు.

బాబు తప్పిదం వల్లే.. 'వాల్' ఢమాల్

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పోలవరం డయాఫ్రమ్‌వాల్‌పై సీడబ్ల్యూసీకి అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక

2017, 2018లో ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-2లో డయాఫ్రమ్‌వాల్ మీదుగా వరద ప్రవాహం

- ఆ ప్రభావం డయాఫ్రమ్‌వాల్‌పై పడకుండా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదన్న కమిటీ
- వరదల ఉధృతికే డయాఫ్రమ్‌వాల్ 693 మీటర్ల పొడవున దెబ్బ తిన్నట్లు స్పష్టీకరణ
- 2017లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పునాదులు జెట్ గ్రౌటింగ్ వాల్‌ల నిర్మాణం
- వరద ప్రభావం వాటిపై పడకుండా ఎలాంటి చర్యలు తీసుకోని టీడీపీ సర్కారు
- 2018 వరదలకు ఎగువ కాఫర్ డ్యామ్‌లో 200 -260 మీటర్ల మధ్య దెబ్బతిన్న జెట్ గ్రౌటింగ్ వాల్

జిల్లా వార్తలు

రామయ్య సన్నిధిలో ప్రముఖులు



ఆలయంలో హైకోర్టుల న్యాయమూర్తులు

భద్రాచలం/బూర్గంపాడు: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాజస్తాన్, తెలంగాణ హైకోర్టుల జడ్జిలు మున్నూరి లక్ష్మణ్, కాజా శరత్‌తో పాటు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు విడివిడిగా దర్శించుకుని పూజలు చేశారు. వీరికి అర్చకులు, ఈఓ రమాదేవి సంప్రదాయ రీతిలో స్వాగతం పలికి పూజల అనంతరం వేదాశీర్వచనం, ప్రసాదం అందజేశారు. ఆలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, హైకోర్టు న్యాయమూర్తి కాజా శరత్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సారపాకలోని ఐటీసీ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

11 అడుగుల కొండచిలువ పట్టివేత



కొండచిలువతో స్థానికులు

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లలోని ఓ ఇంట్లోకి 11 అడుగుల పొడవైన కొండచిలువ చొరబడింది. గ్రామానికి చెందిన సుర వీరయ్య ఇంట్లోకి శుక్రవారం కొండచిలువ వెళ్తుండగా గుర్తించిన గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో బీట్ అధికారి కన్నయ్య ఆధ్వర్యాన గోపి తదితరులు దాన్ని బంధించి సమీపంలోని అడవిలో వదిలిపెట్టారు.

గంజాయి కట్టడిలో పోలీసుల పనితీరు భేష్

సమీక్షలో మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

కొత్తగూడెంరూరల్: గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల పనితీరు మెరుగ్గా ఉందని మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. కొత్తగూడెం హేమచంద్రపురంలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో శుక్రవారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. తొలుత జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, కేసుల పరిష్కారం, గంజాయి రవాణా, మావోయిస్టుల కట్టడి అంశాలను ఎస్పీ రోహిత్‌రాజ్ వివరించారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. అలాగే, పోలీస్‌స్టేషన్ల నిర్వహణ, 5ఎస్ అమలు, సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ నేరాల కట్టడిపై సూచనలు చేశారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు. ఏఎస్పీలు పరితోష్ పంకజ్, అంకిత్‌కుమార్ సంక్వర్, డీఎస్పీలు చంద్రభాను, సతీష్‌కుమార్, రవీందర్‌రెడ్డి, మల్లయ్యస్వామి, ఏఓ జయరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, పక్కన ఎస్పీ రోహిత్‌రాజ్, అధికారులు

టెన్నిస్ ఆడిన ఐజీ

పాల్వంచ: పాల్వంచలో ఇటీవల ప్రారంభించిన లాన్ టెన్నిస్ కోర్ట్‌ను ఐజీ పి.చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. శుక్రవారం తెల్లవారు జామున కోర్ట్‌కు వచ్చిన ఆయన క్రీడాకారులతో కలిసి కాసేపు టెన్నిస్ ఆడారు. ఈసందర్భంగా ఆయనను అసోసియేషన్ బాధ్యులు, కోచ్‌లు సన్మానించారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ యువత క్రీడామైదానాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఐలు కృష్ణారావు, వినయ్‌కుమార్, ఎస్ఐ సుమన్, టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డితో పాటు అన్నం వెంకటేశ్వర్లు, భాస్కర్, కబీర్, వంశీ, డాక్టర్ బసవరాజు పాల్గొన్నారు.



టెన్నిస్ ఆడుతున్న ఐజీ

తల్లి చెంతకు చేరిన బాలుడు...

అక్రమ దత్తత కథ సుఖాంతం

ఖమ్మంవన్‌టౌన్: అక్రమ దత్తత వ్యవహారం కథ ఎట్టకేలకు సుఖాంతమైంది. అయితే, ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టాలని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతీరాణి అధికారులను ఆదేశించారు. మూడేళ్ల క్రితం రఘునాథపాలెంవాసి సాయికి నిజాంపేట ప్రాంతానికి చెందిన స్వప్నతో వివాహం జరిగింది. వీరి కుమారుడు నెలల వయసులో ఉండగానే సాయి రోడ్డు ప్రమాదంలో మరణించగా బాబును తానే పెంచుతానని సాయి తల్లి నాగమణి పెద్దల సమక్షాన ఒప్పుకుంది. కొద్దిరోజులకే శిశువును హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఉద్యోగికి అక్రమంగా దత్తత ఇచ్చింది. ఈ విషయం బయటపడడంతో బాబు తల్లి స్వప్న ఇటీవల ఖమ్మం సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు బాలుడిని శిశుగృహకు తరలించగా శుక్రవారం తల్లి స్వప్నకు అప్పగించారు. అయితే, పూర్తిస్థాయిలో విచారించి అక్రమ దత్తతలో కీలకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న అధికారులు

ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ లక్ష్యసాధన

- సోలార్ విద్యుత్ వెయ్యి మెగావాట్లకు పెంచేలా కృషి
- లాభాల వాటా, దీపావళి బోనస్‌పై సీఎంతో చర్చిస్తాం
- మణుగూరు ఏరియాలో పర్యటించిన సింగరేణి సీఎండీ బలరామ్



క్యాంటీన్‌లో టిఫిన్ చేస్తూ కార్మికులతో మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

మణుగూరుటౌన్: ప్రైవేట్ సంస్థలు, కోల్ ఇండియా నుంచి సింగరేణికి పోటీ ఉన్న నేపథ్యాన కొత్త బ్లాక్‌ల సాధనకు కృషి చేస్తున్నామని, అదే సమయాన బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూ వార్షిక లక్ష్యాల సాధనకు పాటుపడాల్సి ఉందని సింగరేణి సీఎండీ బలరామ్ తెలిపారు. మణుగూరు ఏరియాలో గురువారం రాత్రి డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డితో కలిసి పర్యటించిన ఆయన ఓసీలోని ఓబీ వెలికితీత, యంత్రాల ద్వారా లోడింగ్‌ను పరిశీలించారు. ఆ తర్వాత శుక్రవారం ఉదయం వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటిన సీఎండీ క్యాంటీన్‌లో కార్మికులతో మాట్లాడారు. కార్మికులు కమిటీగా ఏర్పడి కావాల్సిన అల్పాహారంపై యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే, ఒడిశాలోని నైనీ, కొత్తగూడెం వీకే గని, ఇల్లెందులోని రొంపెడు ఓసీ, బెల్లంపల్లి గోలేటి ఓసీలను ప్రారంభించి ఉత్పత్తి లక్ష్యాలను చేరుకుంటామని, సోలార్ ప్లాంట్లను వెయ్యి మెగావాట్లకు చేర్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు.

యంత్రాలను 18 గంటలు వినియోగించాలి

ఈ సంవత్సరం 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరేలా ఉద్యోగులు 8 గంటలు పని చేయడంతో పాటు భారీయంత్రాల వినియోగాన్ని 18 గంటలకు పెంచాలని సీఎండీ బలరామ్ సూచించారు. కోల్ ఇండియాలో టన్ను బొగ్గు ఉత్పత్తి వ్యయం రూ.వెయ్యి ఉండగా.. సింగరేణిలో రూ.4 వేలుగా నమోదవుతున్నందున తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, లాభాల వాటా, దీపావళి బోనస్, ఇతర ఆర్థిక ప్రయోజనాలపై సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడుతామని తెలిపారు. అనంతరం సింగరేణి స్కూల్‌ను పరిశీలించి గత ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించిన ఆయన, వచ్చే ఏడాది మణుగూరు సింగరేణి స్కూల్‌లో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో అధికారులు వెంకటేశ్వర్లు, లక్ష్మీపతిగౌడ్, వీరభద్రరావు, శ్యాంసుందర్, శ్రీనివాస్, రాంబాబు, వీరభద్రుడు, సురేశ్, సలగల రమేశ్, స్వరూపారాణి, షబ్బీరుద్దీన్‌తో పాటు నాయకులు వై.రాంగోపాల్, వి.కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఎయిర్‌వాల్వ్, సర్జ్‌షాఫ్ట్ నుంచి నీరు!

ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌ల్లో మోటార్లను గురువారం స్విచాన్ చేయగా.. ఎయిర్‌వాల్వ్ నుంచి నీళ్లు ఎగజిమ్మడం ఫౌంటెన్లను తలపించింది. ములకలపల్లి మండలం పూసుగూడెం శివారులోని పంప్‌హౌస్-2 మోటార్లను గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ఆన్ చేసిన విషయం విదితమే. కాసేపటికి అక్కడికి సమీపంలోని ఎయిర్ వాల్వ్ నుంచి గాలి తోపాటు నీరు కూడా పైకి ఎగజిమ్మింది. ఇది ఫౌంటెన్‌ను తలపించగా స్థానికులు ఆసక్తిగా పరిశీలించారు. అయితే, మోటార్లను ఆన్ చేసి ఆఫ్ చేశాక గాలి బయటకు వెళ్లే క్రమంలో కొంత మేరకు నీళ్లు రావడం సాధారణమేనని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కాగా, కమలాపురంలోని పంప్‌హౌస్-3 మోటార్ ఆన్ చేసినప్పుడు కూడా డిశ్చార్జ్ కెనాల్‌కు వెళ్లే మార్గంలోని సర్జ్ షాఫ్ట్ (పైపుల్లో గాలి బయటకు వెళ్లేలా చేపట్టిన ఎత్తయిన నిర్మాణం) నుంచి నీళ్లు విరజిమ్మడం ఫౌంటెన్ మాదిరి కనిపించింది. కొద్దిరోజుల కిందట ట్రయల్ రన్ సమయాన ఈ విషయాన్ని గుర్తించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సర్జ్‌షాఫ్ట్ ఎత్తు పెంచి నీటి వృథాను అరికట్టాలని అధికారులకు సూచించారు.



కమలాపురం పంప్‌హౌస్-3 వద్ద సర్జ్‌షాఫ్ట్ నుంచి ఎగజిమ్ముతున్న నీరు

ఇస్రో కళాశాలలో సారపాక విద్యార్థికి సీటు

ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చదవనున్న నీలోఫర్

బూర్గంపాడు: భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన షేక్ నీలోఫర్ ఇస్రో పరిధిలో కొనసాగుతున్న ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సీటు సాధించింది. సారపాకకు చెందిన నన్నేమియా ఐటీసీ పీఎస్‌పీడీలో పర్మనెంట్ కార్మికుడిగా పనిచేస్తుండగా, ఆయన కుమార్తె నీలోఫర్ ఐటీసీ అనుబంధ భద్రాచలం పబ్లిక్ స్కూల్, హైదరాబాద్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో చదివాక ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్ ఐఐటీలో సీటు సాధించింది. ఇంతలోనే ఆమెకు ఇస్రో అనుబంధ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో సీటు దక్కింది. ఈ సందర్భంగా నీలోఫర్ మాట్లాడుతూ.. స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో రాణించాలన్న తన కల నెరవేరుతుండటం ఆనందంగా ఉందని చెప్పగా.. ఆమెను ఐటీసీ అధికారులు అభినందించారు.



ఇస్రో కళాశాల వద్ద నీలోఫర్

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ తరచుగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ శరత్ ఎస్సీ, ఎస్టీ గురుకులాల కార్యదర్శులు అలుగు వర్షిణి, సీతామాలక్ష్మి, అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, విద్యాశాఖ డీడీ చందనతో కలిసి పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణపై హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పాఠశాలల్లో, వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్ది, మెనూ అమలుపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు జ్వరాల బారిన పడకుండా తరచూ వైద్యపరీక్షలు చేయించాలని తెలిపారు. అనంతరం భద్రాచలం ఐటీడీఏ నుంచి పీఓ రాహుల్ మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది సహకారంతో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గురుకులాల ఆర్‌సీఓ నాగార్జున్‌రావు, ఏటీడీఓ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పీఓ రాహుల్